# పొడుపు కథలు

1. శ్రీరాముడు కూడా పట్టి వంచలేనిది
   రంగురంగులుగా ఒకే వరుసలో వచ్చునది
   కుక్కకీ, నక్కకీ పెళ్ళంటే ఆ సమయంలో వచ్చునది
   ఏమిటది?

2. కిటకిట తలుపులు కిటారు తలుపులు
   ఎంతమూసినా చప్పుడు కాదు
   ఏమిటవి?

3. నా నోరు మూసుకోదు, నానాలుక ఊరుకోదు
   తగిలితే అరుస్తాను, దైవాన్ని పిలుస్తాను
   నేనెవరిని?

4. కడుపులో పిల్లలు, కంఠంలో నిప్పులు
   అరుపేమో ఉరుము, ఎరుపంటే భయమ్
   నేనెవరిని?

5. సూర్యుడు చూడని గంగ
   చాకలి ఉతకని బట్టలు
   ఏమిటవి?

6. ప్రాణములేని చిన్న పాప
   అరచి అరచి పిలుస్తుంది
   ఎత్తుకుంటే చెవిలో గుసగుసలాడుతుంది
   ఎవరది?

7. శరీరంపైకి ఎక్కానంటే వీలు చూసుకుని సూదిని దింపేస్తాను
   ద్రవాన్నెక్కించి, రక్తాన్ని జుర్రేస్తాను: సిరంజిని కాను
   ఆయుష్షు బాగుంటే బ్రతుకుతాను
   లేకుంటే వారి చేతుల్లో చనిపోతాను
   నేనెవరిని?

8. తండ్రి గరగర
   తల్లి పీచు పీచు
   బిడ్డలు రత్నమాణిక్యాలు
   ఏవరు వీరు?

9. ఎండైనా వానైనా నేను కావాలి
   నన్ను కావాలనుకునే వారు ఒత్తిడి చేస్తే విచ్చుకుంటాను
   లేదంటే ముడుచుకుని మూల కూర్చుంటాను
   నేనెవరిని?

10. ఓడ కాని ఓడ నేను
    నాకూ ప్రాణముంది
    నేనెవరిని?